క్లుప్తంగా

నర్సుల విభాగం చైర్‌పర్సన్‌గా మంజులాదేవి



మంజులాదేవిని సన్మానిస్తున్న ఏపీజీఈఏ రాష్ట్ర ఉద్యోగులు సూర్యనారాయణ

కర్నూలు(హాస్పిటల్): ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) నర్సుల విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్‌గా కర్నూలుకు చెందిన డి.మంజులాదేవిని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ నియమించారు. గురువారం విజయవాడలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారికంగా ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మంజులాదేవి మాట్లాడుతూ.. ఈ సమావేశానికి విశాఖపట్టణం, నెల్లూరు, కర్నూలు, విజయవాడ, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి నర్సుల ప్రతినిధులు హాజరయ్యారని, నర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సేవా సంబంధిత అంశాలపై చర్చించారని తెలిపారు. నర్సుల విభాగాన్ని మరింత బలోపేతం చేయడం, నర్సింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆమె చెప్పారు.

లోక్ అదాలత్‌పై అవగాహన

కర్నూలు(సెంట్రల్): శాశ్వత లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు అందే 10 రకాల న్యాయ సేవలపై ఆ సంస్థ చైర్మన్ వెంకట హరినాథ్ స్టాక్‌హోల్డర్లు, ఎన్‌జీఓలకు అవగాహన కల్పించారు. గురువారం న్యాయ సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది కర్నూలు జిల్లాలో శాశ్వత లోక్ అదాలత్ ద్వారా 126 కేసులు రాగా 56 కేసులకు పరిష్కారం చూపినట్లు చెప్పారు. ఒక్క రూపాయి ఫీజు లేకుండా ఉచితంగా కేసులను పరిష్కరించే అవకాశం ఉంటుందని చెప్పారు.

చిరస్మరణీయుడు గాబ్రియల్



గాబ్రియల్ ఫెలోపియో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): శరీర నిర్మాణ శాస్త్రవేత్త, వైద్యుడు గాబ్రియల్ ఫెలోపియో సేవలు చిరస్మరణీయమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ అన్నారు. ఆయన వర్ధంతి పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గాబ్రియల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి గాబ్రియల్ ఫెలోపియో సేవలను కొనియాడారు. వైద్యాధికారులు నాగప్రసాద్, మహేశ్వరప్రసాద్, ఎస్‌ఓ హేమసుందరం, డెమో ప్రకాష్‌రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డుల్లోని కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ప్రతినిధి బృందం కల్లూరు అర్బన్ 32వ వార్డులోని సుందరయ్య నగర్, గంగావతినగర్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగావతి నగర్‌లో పైపులైన్ మరమ్మతుల కోసం కొద్ది రోజులుగా అలాగే ఉంచారన్నారు. దీంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. డ్రైనేజీ కాలువలు పూడికతో నిండాయని తెలిపారు. నాయకులు హుస్సేన్ బాషా, విజయ్ కుమార్, సురేష్, దావీదు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

మానసిక కల్లోలం

- పెరుగుతున్న మానసిక వ్యాధిగ్రస్తులు
- నిరుద్యోగం, కుటుంబ సమస్యలు, చదువు, ఉద్యోగ ఒత్తిళ్లే కారణం
- అధికంగా డిప్రెషన్, స్కిజోఫ్రినియా, మానియా, యాంగ్జైటీ సమస్యలు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం



కర్నూలు(హాస్పిటల్): ఒంటరిగా మాట్లాడుకోవటం, రోడ్లపై బట్టలు లేకుండా తిరగడం, గంతులు వేయడం వంటి సమస్యలే మానసిక వ్యాధులు కావు. ఎప్పుడూ దిగులుగా ఉండటం, ఎదుటి వారిని అకారణంగా అనుమానించడం, పరీక్షలంటే భయం, ఫెయిలవుతాననే ఆందోళన, చదువు భారమైందని ఆత్మహత్యకు పాల్పడటం, ఎదుటివారు నవ్వుతున్నా తనను చూసే నవ్వుకుంటున్నారని భ్రమపడటం, ఏదైనా సమస్య వస్తే తాను తీవ్ర అవమానాలకు గురికావాల్సి వస్తుందేమోనని భయపడిపోవడం, అలాంటి విషయాలు తలచుకుని భయంతో వణికిపోవడం, గుండె దడ, అతిగా మద్యం, మత్తు పదార్థాలు సేవించడం వంటి విషయాలు కూడా మానసిక వ్యాధులే. వీటికి సరైన సమయంలో కౌన్సిలింగ్/మందులు తీసుకోకపోవడం వల్ల చాలా కాపురాలు కూలిపోతున్నాయి. ఈ నెల 10న మానసిక ఆరోగ్య దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో మానసిక జబ్బులున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక వ్యాధుల విభాగం ఓపీకి రోజూ వంద నుంచి 120 మంది రోగులు వస్తుండగా అందులో 30 మంది కొత్త వారు ఉంటున్నారు. ఇక ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం సగటున రోజూ 30 నుంచి 50 మంది దాకా రోగులు చికిత్స కోసం వెళ్తున్నారు. సమాజంలో తీవ్రమైన మానసిక సమస్యలు (స్కిజోఫ్రీనియా, మానియా, డిప్రెషన్, అతిగా మద్యపానం, మత్తు పదార్థాలు సేవించడం) వారు 5 శాతం, ఇతర మానసిక వ్యాధులు ఉన్న వారు 15 నుంచి 20 శాతం వరకు ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదిస్తే రోగికి కౌన్సిలింగ్ ద్వారా, మందుల ద్వారా నయం చేయవచ్చని వారు సూచిస్తున్నారు.

లక్షణాలు

- ఆందోళన, భయం, గుండె దడ, అధికంగా చెమటలు, కాళ్లు, చేతులు వణకడం, ఛాతి నొప్పి, ఊపిరి తీసుకోవడంలో కష్టం
- అనవసర ఆలోచనలు, పనులు మళ్లీ మళ్లీ చేయడం
- అకస్మాత్తుగా మాట పోవడం, కాళ్లు, చేతులు పడిపోవడం, మూర్ఛ రావడం
- విచారంగా ఉండటం, పనిలో ఉత్సాహం లేకపోవడం, ఆకలి, నిద్ర లేకపోవడం, ఆత్మహత్యాలోచనలు
- ప్రవర్తనలో మార్పు, సంధి ప్రేలాపనలు, పూనకం, తనకు తాను గుర్తుకు లేకుండా తిరగడం
- అధికంగా ఆల్కహాలు, మాదక ద్రవ్యాల అలవాటు
- తనలో తాను నవ్వుకోవటం, మాట్లాడుకోవడం, ఇతరులను అనుమానించడం
- కలత నిద్ర, నిద్ర పట్టకపోవడం, నిద్రలో నడవడం, మాట్లాడుట, కలవరింతలు

ఇలా చేయాలి

- ఇష్టమైన పనులు చేయాలి
- బాధలు, కష్టాలను కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పంచుకోవాలి
- వాకింగ్, ధ్యానం, యోగా చేయాలి
- విహార యాత్ర, సినిమాలు, షాపింగ్‌కు వెళ్లాలి.

జాతీయ విపత్తులుగా బెట్టింగ్‌లు, డ్రగ్స్



ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా ఈ సారి థీమ్‌గా 'విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మనిషిని మానసిక ఒత్తిళ్ల నుంచి ఎలా బయటకు తీసుకురావాలి' అనేది ఉంది. దేశంలో డ్రగ్స్, బెట్టింగ్‌లు జాతీయ విపత్తులుగా మారాయి. దీని వల్ల ఆర్థిక వ్యవస్థ పతనమయ్యే పరిస్థితి ఏర్పడింది. యువత వీటి బారిన పడి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించాలి.

– డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, మానసిక వైద్యనిపుణులు, కర్నూలు

వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి



చాలా మందికి మానసిక జబ్బులు, సమస్యలు వచ్చినప్పుడు చికిత్స ఎక్కడ చేస్తారన్న అవగాహన ఉండదు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆదివారం మినహా ప్రతిరోజూ మానసిక వ్యాధుల విభాగంలో ఇలాంటి వారికి చికిత్స అందిస్తున్నాం. రోజూ వంద మందికి పైగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇంట్లోని వాతావరణం, కుటుంబసభ్యుల మధ్య సంబంధ బాంధవ్యాలు సన్నగిల్లడం, చెడుఅలవాట్లకు బానిస కావడం, ఒత్తిళ్లు మానసిక జబ్బులకు కారణం అవుతున్నాయి. వీటన్నింటికీ వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుంటే మళ్లీ ఆరోగ్యంగా మారతారు.

– డాక్టర్ డి.గంగాధర్‌నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకియాట్రి విభాగం, జీజీహెచ్, కర్నూలు

భోజనం బాగుందా?

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని అన్నా క్యాంటీన్‌ను కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం రాత్రి ఆమె క్యాంటీన్‌ను పరిశీలించి భోజనం నాణ్యతను రుచి చూశారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. భోజనం బాగుందా? పరిసరాలు శుభ్రంగా ఉంటున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యతగా తయారు చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

11న రోలర్ స్కేటింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): బి.క్యాంపులోని ఖానా ఖాజానా రహదారిలో రోడ్డు రేసులు, మాంటీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రింక్ రేసులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి అబుబకార్, సీఈఓ సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కేటింగ్‌లో క్వాడ్, ఇన్‌లైన్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ వరకు కాకినాడలోని వైఎస్సార్ రింకులో నిర్వహించే 37వ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



శీనప్ప (ఫైల్)

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామానికి చెందిన మాల శీనప్ప గత నెల 7 నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు మాల యల్లమ్మ, మాల రామంజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతి గురువారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 9121101162 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

బధిరులతో భావ వ్యక్తీకరణ ముఖ్యం



మాట్లాడుతున్న ఎన్‌సీడీ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): బధిరులతో మాట్లాడేటప్పుడు వారి భావాలు తెలుసుకోవడం ముఖ్యమని ఎన్‌సీడీ జిల్లా అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బధిరులు కూడా ఇతరుల్లాగే భావనలు, అభిరుచులు, అవసరాలు కలిగి ఉంటారన్నారు. వారికి కూడా సరైన కమ్యూనికేషన్ అవసరమని, రాయడం, చూపించడం, మొబైల్ లేదా ఇతర టెక్నాలజీ ద్వారా సమాచారం ఇచ్చి పుచ్చుకోవచ్చన్నారు. డైస్ మేనేజర్ ఇర్ఫాన్ షేక్ మాట్లాడారు. వైద్యాధికారులు సృజన, రాజేశ్వరి, సుధాకర్, మల్లికార్జున, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ, ధన్వంతరి హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. నూతన జీఎస్టీ వల్ల తగ్గిన మందుల ధర, వైద్య పరికరాలు, డయాగ్నోస్టిక్ టూల్స్, ఆర్థోపెడిక్ పరికరాల ధరల గురించి ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం వివరించారు. దీనివల్ల రోగులకు భారీ ఊరట లభిస్తుందని చెప్పారు. వ్యక్తిగత బీమా పాలసీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారని తెలిపారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, వైద్యులు శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, శారద, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

- కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ జీఎస్టీ 2.0పై మాట్లాడారు. తగ్గనున్న వస్తువుల ధరల గురించి కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ మహేశ్వర రెడ్డి, డాక్టర్ సోమశేఖర్ పాల్గొన్నారు.
- ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ భరత్ మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు వల్ల మందులు, వైద్య పరికరాల ధరలు తగ్గుతాయని, దీనివల్ల రోగులపై భారం తగ్గుతుందన్నారు.
- స్థానిక ప్రకాష్ నగర్‌లోని వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషారెడ్డి ఆధ్వర్యంలో నూతన జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం



సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సీపీఐ నగర సహాయ కార్యదర్శి దండోళం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నగరంలోని 97,107, 108వ సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో టిడ్కో గృహాలను వినియోగంలోకి తేవాలని, మధ్యలో వదిలేసిన ఇందిరమ్మ గృహాల నిర్మాణం పూర్తిచేసి పేదలకు కేటాయించాలని కోరారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

కర్నూలు(అర్బన్): బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర వర్గాలన్నీ ఉద్యమాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డిపోగు డేవిడ్ అన్నారు. గురువారం మాన్యశ్రీ కాన్షీరాం 19వ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సభ నిర్వహించారు. బీఎస్పీ సీనియర్ నాయకులు మోజెస్ అధ్యక్షతన జరిగిన సభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షులు టీ.శేషఫణి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, దళిత సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము పాలెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బహుజన పితామహులు మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్, సాహూ మహరాజ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయా సంఘాల నాయకులు శాంతకుమార్, అమర్నాథ్, రామశేషయ్య, పల్లె నాగరాజు, విజయకుమార్, తిప్పన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారని ధర్నా

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శానిటేషన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా తొలగించారని నాగరాజు అనే వ్యక్తి కుటుంబంతో కలసి ధర్నా చేశారు. ఆసుపత్రిలోని పారిశుధ్య కార్యాలయం వద్ద గురువారం ధర్నాలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన తాను ఏడేళ్లుగా ప్రభుత్వాసుపత్రిలో శానిటేషన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని చెప్పారు. డిగ్రీ అర్హత లేదని కారణం చూపుతూ తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నఫలంగా విధుల్లోంచి తొలగిస్తే తన కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగులు ఒత్తిడికి గురికావొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగులు ఒత్తిడికి గురి కాకుండా ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ అసిస్టెంటు అధికారి వి.రఘువీర్ సూచించారు. గురువారం కృష్ణానగర్‌లోని రిటైర్డ్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో స్వర్గీయ బాసు శివరామిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏటీవో రఘువీర్ ప్రారంభించారు. మెడికవర్ హాస్పిటల్ వైద్యులు మురళిమోహన్, శశికిరణ్, మంజునాథ్ తదితరులు విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రిటైర్డ్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ సొసైటీ ప్రసిడెంట్ విశ్వేశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



బహిరంగ సభ ప్రాంతంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాల తనిఖీ

కర్నూలు: ప్రధానమంత్రి కర్నూలు పర్యటన నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. నగర సరిహద్దులో ఉన్న ప్రధాన మార్గాల్లో చెక్ పాయింట్లు ఏర్పాట్లు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుల్లూరు టోల్‌గేట్, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నంద్యాల చెక్‌పోస్టు, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్చాల రోడ్ జంక్షన్, గుత్తి పెట్రోల్ బంకు దగ్గర, ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని నన్నూరు టోల్‌గేట్ వద్ద చెక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. అలాగే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో లాడ్జిలలో తనిఖీలు నిర్వహించారు. స్పెషల్ పార్టీ పోలీసులు అనుమానిత వ్యక్తులు లేదా అనుమానిత వస్తువులను గుర్తించడానికి విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాని పర్యటించే మార్గాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు కూడా నిర్వహించారు. ఎయిర్ పోర్టు నుంచి హెలిప్యాడ్ వరకు, బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే జీఎస్టీ తగ్గింపు



మాట్లాడుతున్న గణేష్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): దేశ ప్రజలు రాహుల్‌గాంధీ సారథ్యం కోసం ఎదురు చూస్తున్నారని, త్వరలోనే రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అవ్వడం ఖాయమని ఏఐసీసీ సెక్రటరీ, ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ గణేష్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం కళా వెంకట్రావు భవన్‌లో జిల్లా కాంగ్రెస్‌కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనతో దేశ ప్రజలు విసిగిపోయారన్నారు. 11 ఏళ్లపాటు జీఎస్టీ భారం వేసి బీహార్ ఎన్నికల సమయంలో తగ్గించి ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి మాట్లాడుతూ.. బీజేపీ దొంగ ఓట్లపై సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గాల వారీగా పార్టీ పటిష్టతపై చర్చించారు. నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహయాదవ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర బాబు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ వల్లే దృష్టి సమస్యలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సత్యనారాయణ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుతం చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అతిగా టీవీలు, మొబైల్ ఫోన్‌ను వాడటం వల్లే దృష్టి సమస్యలు అధికంగా వస్తున్నాయని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి చెప్పారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కంటి ఆసుపత్రి నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కంటి జబ్బులు రాకుండా, వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లల్లో దృష్టిలోపాలను గుర్తించేందుకు 18 ఏళ్లలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎంఓ డాక్టర్ భరత్, వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్, నర్సులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న 'మోదీ గోబ్యాక్' నిరసనలు

- 11 ఏళ్లు జీఎస్టీ భారం వేసి ఇప్పుడు తగ్గించి సంబరాలా?
- జీఎస్టీతో ఏటా రూ.8 లక్షల కోట్ల ఆదాయం తగ్గిందన్న చంద్రబాబు సంబరాల్లో పాల్గొనడం విడ్డూరం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): జీఎస్టీ సంబరాల ఉత్సవం పేరుతో ప్రధాని నరేంద్రమోదీ అక్టోబర్ 16న చేపట్టనున్న కర్నూలు పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో 15వ తేదీన మోదీ గోబ్యాక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.గిడ్డయ్య, డి.గౌస్‌దేశాయ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ హాజరుకానున్నట్లు చెప్పారు. గురువారం సీఆర్ భవన్‌లో వారు మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా ప్రజలపై జీఎస్టీ భారం వేసి నయవంచన చేశారని, ఇప్పుడు బీహార్ ఎన్నికల కోసం తగ్గింపు అంటూ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు జీఎస్టీతో రాష్ట్రానికి ఏటా రూ.8 లక్షల కోట్ల ఆదాయం తగ్గిందని చెప్పిన సీఎం చంద్రబాబు, ఆ మొత్తాన్ని తిరిగివ్వాలని మోదీని కోరాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, కడప స్టీలు ప్లాంటు, వైజాగ్ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని తిరుపతి వేంకటేశ్వరస్వామి సాక్షిగా చెప్పిన మోదీ, చంద్రబాబు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. నాయకులు లెనిన్ బాబు, మునెప్ప, రాధాకృష్ణ, అంజిబాబు, నాగన్న, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు మెప్మా సభ్యులు తరలిరావాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న స్థానిక నంద్యాల రోడ్డులోని రాగమయూరి గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు మెప్మా సభ్యులు తరలిరావాలని మెప్మా పీడీ శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. ప్రతి సమాఖ్య నుంచి కనీసం 150 మంది సభ్యులను సమీకరించాలన్నారు. ఇందుకోసం ప్రతి సమాఖ్యకు 3 బస్సులు కేటాయించామని, ప్రతి బస్సులో ఒక ఆర్‌పీ, ఒక జీఎస్‌డబ్ల్యూ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల కోసం ఆహారం, తాగునీరు వంటి సౌకర్యాలు సమకూర్చినట్లు చెప్పారు. ప్రతి ఆర్‌పీ పరిధిలోని గ్రూపులలో రోజుకు 10 గ్రూపుల చొప్పున సమావేశాలు ఏర్పాటు చేసి సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెక్నికల్ ఎక్స్‌పర్ట్ మురళీ, మెప్మా మిషన్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, టీఎంసీలు సుధాకర్, భారతి సీఓలు పాల్గొన్నారు.

భద్రతా లోపాలకు తావివ్వొద్దు




పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: జీఎస్టీ సంస్కరణ ఉత్సవ్‌లో భాగంగా ఈనెల 16న కర్నూలులో నిర్వహించనున్న ప్రధాని బహిరంగ సభకు భద్రతాపరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. ఓర్వకల్లు మండలం నన్నూరు రాగమయూరిలో బహిరంగ సభ ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి సెక్టార్‌కు ఇన్‌చార్జ్‌లుగా, భద్రత పర్యవేక్షణ అధికారులుగా పోలీసు ఉన్నతాధికారులు ఉంటారని, సీఐలు, ఎస్ఐలు లైజనింగ్ ఆఫీసర్లుగా ఉంటారన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. అనంతరం హెలిప్యాడ్ ప్రాంతాలు, వీవీఐపీ కాన్వాయ్ పర్యటించే ప్రాంతాలు, వీవీఐపీ, పబ్లిక్ గ్యాలరీలను ఎస్పీ పరిశీలించారు. అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చేగువేరాకు నివాళి

కర్నూలు(సెంట్రల్): నేటి యువత చేగువేరా పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గిడ్డయ్య, గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు యుక్త వయసులో మెడికల్ విదార్థిగా ఉన్న చేగువేరా లాటిన్ అమెరికలో పర్యటించి పేదరికాన్ని చూసి పరివర్తన చెందారన్నారు. ఆయన పోరాటాలను ఏఐవైఎఫ్ ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. సీపీఐ నాయకులు లెనిన్‌బాబు, మునెప్ప, జగన్నాథం, రామకృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు
(క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	4,075	7,299
పొద్దుతిరుగుడు	6,209	6,480
ఆముదం	5,259	5,726
వాము	10,079	20,140
ఉల్లి	218	1,181
ఎండుమిర్చి	4,860	6,195
శనగలు	3,729	3,729
కందులు	3,600	6,369
మొక్కజొన్న	1,739	1,790
మినుములు	1,000	6,880
కొర్రలు	2,210	2,259
సోయాచిక్కుడు	1,200	1,200
సజ్జలు	1,729	2,051

ఫోన్ నం : 08518-257204, 257661